సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



పాపికొండల్లో వైల్డ్ డాగ్స్

పాపికొండల అభయారణ్యంలో క్రూర జంతువులైన అడవి కుక్కలు (వైల్డ్ డాగ్స్) గుంపులుగా సంచరిస్తున్నాయి.

8లో ▸



శ్రీవారి భక్తులకు 'సెల్' కష్టాలు

ద్వారకాతిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు సెల్‌ఫోన్లను భద్రపరుచుకునేందుకు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తోంది.

8లో ▸



నలుగురి అరెస్ట్

గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను భీమడోలు పోలీసులు అరెస్ట్ చేశారు. 2.13 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

8లో ▸

ఉధృతంగా వరద గోదావరి

- నదిలో పెరుగుతున్న ఉధృతి
- 4.31 లక్షల క్యూసెక్కులు దిగువకు..
- గత నెలలో 420 టీఎంసీలు కడలిపాలు
- ముంపు గ్రామాల్లో భయం.. భయం
- 18 నాటికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం



పోలవరం ప్రాజెక్టు వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గోదావరిలో మళ్లీ వరద మొదలైంది. ఈ సీజన్‌లో ముచ్చటగా మూడోసారి వరద తీవ్రత ప్రారంభమై నదిలో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలతో గోదావరి, శబరి నదులు రెండు రోజుల నుంచి ఉధృతంగా మారాయి. శనివారం పోలవరం ప్రాజెక్టు నుంచి 4.31 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. మరో మూడు రోజులపాటు వరద ఉధృతి కొనసాగే అవకాశం ఉంది.

భద్రాచలం వద్ద 29.80 అడుగులు

భద్రాచలం వద్ద శనివారం 29.80 అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే 29.680 మీటర్ల ఎత్తు నుంచి దిగువకు 4,31,813 క్యూసెక్కుల నీటిని సాయంత్రం 6 గంటల సమయానికి విడుదల చేశారు. ఆదివారం రాత్రికి 6 లక్షల క్యూసెక్కులు దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే మరో నాలుగు రోజుల పాటు మహారాష్ట్ర, తెలంగాణలో అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు అధికంగా కురుస్తాయని అంచనా వేశారు. దానికి అనుగుణంగా సోమవారం భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉంది. తర్వాత రెండు రోజుల పాటు 6 నుంచి 7 లక్షల క్యూసెక్కుల నీరు పోలవరం ప్రాజెక్టుకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయితే వేలేరుపాడులో 18 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. మళ్లీ వరద హెచ్చరికలతో ముంపు గ్రామాల్లో భయం నెలకొంది.

30 టీఎంసీలు నిల్వ చేస్తూ..

ఏటా జూలై, ఆగస్టు నెలల్లో రెండు సార్లు వరదలు వస్తుంటాయి. అయితే ఈ ఏడాది ఇప్పటికే జూలైలో రెండుసార్లు వరద రాగా తాజాగా మూడోసారి మొదలైంది. గత నెలలో గోదావరి, శబరి మాత్రమే ఉధృతంగా ప్రవహించి 13, 14వ తేదీల్లో 7 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల కావడంతో ఏజెన్సీతో పాటు యలమంచిలిలోని లంక గ్రామాలకు నీరు చేరిన పరిస్థితి. ఈసారి గోదావరి, శబరితో పాటు తమ్మిలేరు, మున్నేరు కూడా భారీ వరద నీటితో ఉధృతంగా మారుతున్నాయి. దీంతో తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులో 30 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచి, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటిని యథాతథంగా విడుదల చేస్తున్నారు.

ఈ సీజన్‌లో మూడోసారి

ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో గోదావరికి ముచ్చటగా మూడోసారి వరద ప్రారంభమైంది. గత నెలలో రెండుసార్లు వరదలు వచ్చాయి. మళ్లీ శుక్రవారం నుంచి వరద తీవ్రత ప్రారంభమైంది. ఏటా వర్షాకాలం సీజన్‌లో వరదల నేపథ్యంలో సగటున 1,900 టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్నట్టు అధికారిక అంచనా. గత నెలలో రెండుసార్లు వచ్చిన వరదలతో ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులో రాకపోకల్లో కీలకంగా ఉండే ఎద్దులవాగు, గుండేటి వాగు వంతెనలు కొన్ని రోజుల పాటు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వేలేరుపాడులో 18 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. అలాగే 270 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు కూడా తరలించిన పరిస్థితి. దీంతో పాటు జూలై నెలలో వచ్చిన రెండు వరదలకు రోజుకు సగటున 4 లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలై మొత్తంగా 420.26 టీఎంసీల నీరు కడలిపాలయ్యింది.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



తణుకులో ఉట్టి కొడుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శిబిరంలో పూజాదికాలు జరిపించారు. కృష్ణ భగవానుడి ఆశీస్సులతో ప్రజలంతా అష్టైశ్వర్యాలతో తులతూగాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కారుమూరి ఆకాంక్షించారు. అనంతరం ఆయన ఉట్టి కొట్టి చిన్నారులతో కలిసి ఉత్సాహంగా గడిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ శెట్టిబలిజ విభాగ అధ్యక్షుడిగా కవురు



పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర శెట్టిబలిజ విభాగ అధ్యక్షుడిగా శాసనమండలి సభ్యుడు కవురు శ్రీనివాస్‌ను నియమించారు. శనివారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం జరిగినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది. కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ తనకు పలు పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించిందన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కమ్యూనిటీ సంఘ పెద్దలు, సభ్యులను కలుపుకుని పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డులివ్వాలి



మాట్లాడుతున్న దిగుపాటి రాజగోపాల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): న్యాయవాదులకు ప్రభుత్వం హెల్త్ కార్డులు ఇవ్వాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. యూనియన్ జిల్లా కమిటీ సమావేశం శనివారం స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు మ్యాచింగ్ గ్రాంట్ కింద మృతి చెందిన న్యాయవాదుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఇస్తానని వాగ్దానం చేశారని, అయితే రాష్ట్రంలో 1,275 మంది న్యాయవాద వృత్తిలో మృతి చెందితే 103 మందికి మాత్రమే ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణకు చర్యలు తీసుకోవాలని, కొత్తగా వచ్చిన న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వాలని అన్నారు. లా నేస్తం పథకాన్ని కొనసాగించాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకుంటే పోరాటాలే శరణ్యమన్నారు. లక్ష్మి, కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశంచౌక్): సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని, రాగద్వేషాలకు అతీతంగా జీవనం సాగిస్తే మానవ జన్మకు సార్థకత అని హరేరామ మూమెంట్ అక్షయ పాత్ర అధ్యక్షుడు వంశీధర్ దాసు అన్నారు. స్థానిక ఆనంద ఫంక్షన్ హాల్‌లో ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను కలెక్టర్ నాగరాణి హాజరై ప్రారంభించారు. హరేరామ హరేకృష్ణ నామమే సుఖాల రుగ్మతలకు పరిష్కారమని దాసు అన్నారు. భగవద్గీత మానవుని మనుగడకు మార్గదర్శకమన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, ఆనందరాజు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథ్‌రాజు, విజయవాడ గోకుల క్షేత్రం సభ్యుడు మహత్రవ దాసు, వేడుకల కమిటీ సభ్యుడు కంతేటి వెంకటరాజు తదితరులు హాజరయ్యారు. చిన్నారులకు శ్రీకృష్ణుని వేషధారణ, చిత్రలేఖనం, స్వామి కీర్తనలు, సంప్రదాయ నృత్యాలు, శ్లోకాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా జిల్లానలుమూలల నుంచి 350 మంది హాజరయ్యారు.

3 టన్నుల కూరగాయలు అందజేత



విరాళంగా అందించిన కూరగాయలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు నూజివీడుకు చెందిన దాత నక్కా సత్యనారాయణ శనివారం 3 టన్నుల కూరగాయలను విరాళంగా అందజేశారు. దొండ, బెండ, దోస, సొర, టమోటాలు వంటి పలు రకాల కూరగాయలను అందజేసి, స్వామివారి అన్నప్రసాదంలో వినియోగించాలని కోరారు.

ఉండి.. బస్టాండ్‌లో సమస్యలు దండి

- చెరువును తలపిస్తున్న ప్రాంగణం
- పాలకులూ పట్టించుకోరా?







ఉండి బస్టాండ్ ప్రాంగణంలో చెరువులను తలపిస్తున్న గోతులు

ఉండి: ఉండి నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పదేపదే చెబుతున్న కూటమి పాలకులు ఒక్కసారి ఉండి బస్టాండ్‌పై లుక్కేయండని ప్రయాణికులు అంటున్నారు. నియోజకవర్గాన్ని తలమానికంగా చేస్తామంటే ఏంటో అనుకున్నాం కానీ బస్టాండ్ ప్రాంగణాన్ని చెరువుగా మార్చడమా అని ఎద్దేవా చేస్తున్నారు. బస్టాండ్ ప్రాంగణమంతా భారీ గోతులు పడి కొద్దిపాటి వర్షానికీ మునిగిపోతోంది. నెలల తరబడి ప్రాంగణం ఇలా ఉన్నా కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదు. బస్టాండ్ ఆవరణలో రోడ్డు కనీసం 100 మీటర్లు కూడా లేదని, దీనిని సీసీ రోడ్డుగా నిర్మించే ఆలోచన కూడా పాలకులకు లేదని అంటున్నారు. ఉండి బస్టాండ్‌కు విజయవాడ, ఏలూరు, గుడివాడ, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాలకు జంక్షన్‌గా ఉంది. బస్టాండ్‌లో కనీసం కూర్చునేందుకు కుర్చీలు, బల్లలు లేవు. తాగునీటి సౌకర్యం లేదు. ప్రయాణికులు బస్టాండ్ లోనికి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రజలపై ఎందుకింత కక్ష అని వైఎస్సార్‌సీపీ నాయకులు జంపా నాగేశ్వరరావు, అంగర రాంబాబు, పీవీఆర్‌కే ఆంజనేయరాజు మండిపడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడమే కాదు బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించాలని అంటున్నారు. కూటమి ప్రభుత్వం కనీసం బస్టాండ్‌లో రోడ్లు కూడా వేయించలేని దుస్థితిలో ఉందా అని ప్రశ్నిస్తున్నారు.

నక్కల కాలువతో పొలాలకు ముంపు



శేషమ్మ చెరువు గ్రామంలో ముంపు పొలం కౌలు రైతు సంఘ నాయకులు

పెనుగొండ: జిల్లాలో 30 వేల ఎకరాల ఆయకట్టు పరిధిలో ముంపునకు కారణమవుతున్న నక్కల కాలువ మురుగు డ్రెయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆచంట, పెనుగొండ మండలాల్లో భారీ వర్షాలతో ముంపు బారిన పడిన చేలను శనివారం ఆయన పరిశీలించారు. అధిక వర్షాలు, నక్కల కాలువ వల్ల శేషమ్మ చెరువు, మార్టేరు, తూర్పుపాలెం, నెగ్గిపూడి, కొఠాలపర్రు, సోమరాజు చెరువు గ్రామాల్లో పొలాలు ముంపు బారిన పడ్డాయన్నారు. వీటిని ఎక్కువగా కౌలు రైతులే సాగుచేస్తున్నారని, ఇప్పటికే ఎకరాకు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. పద్మాల చెరువు, తూర్పుపాలెం వద్ద కాలువపై ఉన్న వంతెన చిన్నగా నిర్మించి రెండు తూములే ఏర్పాటు చేయడంతో ముంపు నీరు లాగడం లేదన్నారు. దీనికి శాశ్వత పరిష్కారంగా వడ్డిలంక డ్యామ్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ మోటర్లను ఆధునీకరించి, డ్యామ్ అవతలి వైపునకు పైపులు నిర్మించి ముంపునీరు బయటకు తోడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పంట కోల్పోయిన రైతులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు కేతా పద్మారావు, గుత్తుల ఏడుకొండలు, దొంగ సోమేశ్వరరావు, చింతపల్లి కొండయ్య పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల సదస్సు

భీమవరం: ఈపీఎస్–95 పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని, కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని కోరుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు భీమవరం యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్టు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎర్ర అజయ్ కుమార్, జిల్లా కన్వీనర్ టి.గంగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈపీఎఫ్ 95 పెన్షన్‌దారులు చాలా నష్టపోతున్నారని, ఐదేళ్లకు ఒకసారి రివ్యూ చేస్తామని గత ప్రభుత్వాలు హామీలు ఇచ్చినా అమలు జరగలేదని పేర్కొన్నారు. సదస్సుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు హాజరవుతారన్నారు.

గౌతు లచ్చన్న ఆదర్శనీయులు



లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న ఆదర్శనీయులని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లచ్చన్న జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌతు లచ్చన్న మార్గం అనుసరణీయమన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, హాస్టళ్ల అధికారులు సీహెచ్ మోహనరావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీవారి కొండ.. భక్తజనమే నిండా



శ్రీనివాసా.. గోవిందా.. అనివేటి మండపంలో భక్తుల రద్దీ



ఉచిత బస్సు వద్ద భక్తులు



భక్తులతో మాట్లాడుతున్న ఈఓ మూర్తి

శ్రీనివాసా గోవిందా.. వేంకట రమణా గోవిందా.. నామస్మరణలు మార్మోగాయి. వేలాదిగా వచ్చిన భక్తులు, నవ దంపతులతో చిన వెంకన్న క్షేత్రం భక్త సాగరాన్ని తలపించింది. శనివారం వేకువజాము నుంచి భక్తుల రాక మొదలైంది. ఆలయ ప్రాంగణం, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, కల్యాణ కట్ట ఇలా అన్ని విభాగాలూ కిటకిటలాడాయి. భక్తులకు అందుతున్న సౌకర్యాలను ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి స్వయంగా పరిశీలించారు. నిత్యాన్నదాన భవనంలో అన్నప్రసాదంపై భక్తులను ఆరా తీశారు. స్వామివారి నిత్య కల్యాణ మండపంలో 192 కల్యాణాలు జరిగాయి. ఆదివారం సైతం భక్తుల రద్దీ కొనసాగనుంది.

-ద్వారకాతిరుమల

ఉండలేక.. కట్టుకోలేక..!

- ముంపు గ్రామాల్లో తాత్కాలిక ఆవాసాలు
- పరిహారం చెల్లింపులో ప్రభుత్వ తాత్సారం
- నిర్వాసితులకు తప్పని అవస్థలు

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్‌లో ముంపునకు గురవుతున్న నిర్వాసిత గ్రామాల్లో ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియను చేపట్టకపోవడంతో నిర్వాసితులు అవస్థలు పడుతున్నారు. పరిహారం ఎప్పటిలోగా చెల్లిస్తారన్నది స్పష్టత ఇవ్వకపోవడంతో శిథిలావస్థకు చెందిన ఇళ్లలో ఉండలేక, కొత్త ఇంటి నిర్మాణం చేపట్టలేక నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. విలీన మండలాల్లో ప్రభుత్వం ఇటీవల ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో ముంపునకు గురవుతున్న గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ వ్యక్తిగత, ఇంటి నిర్మాణాలకు పరిహారం చెల్లించింది. అయితే ఇంకా కొందరికి పరిహారం రావాల్సి ఉంది. ప్రభుత్వం 41 కాంటూర్ అంటూ పరిహారం చెల్లించిన గ్రామాలను 2022లో వచ్చిన గోదావరి వరదలకు గిరిజనులు కనీసం ఖాళీ చేసింది లేదు. అయితే అదే వరదలో 45 కాంటూర్ అని పేర్కొన్న గ్రామాలు పూర్తిగా నీటమునిగాయి. అలా వరదలో దెబ్బతిన్న ఇళ్లనే నిర్వాసితులు బాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొందరు వాటి స్థానంలో తాత్కాలికంగా కర్రలు, రేకులతో షెడ్డు వేసుకుని చుట్టూ బరకాలు కట్టుకుని బతుకుతున్నారు.

స్పష్టత లేకపోవడంతో.. ప్రభుత్వం 45 కాంటూర్ పరిధి గ్రామాలకు పరిహారంపై స్పష్టత ఇస్తే ఇంటి నిర్మాణంపై ఓ నిర్ణయం తీసుకోవచ్చనే భావనలో నిర్వాసితులు వేచి చూస్తున్నారు. కొత్త ఇళ్లు నిర్మించుకుంటే, కొత్త వాటిని కాదని పాత ఇంటి విలువ ప్రకారం పరిహారం ఇస్తే నష్టపోవాల్సి వస్తుందని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. ఇలానే 41 కాంటూర్ పరిధిలోని నిర్వాసితులు ఇప్పటికే నష్టాన్ని చవిచూశారు. అదీ కాక పరిహారం ఎప్పుడిస్తారు, గ్రామాలను ఎప్పుడు ఖాళీ చేయిస్తారు, అసలు చేయిస్తారా లేదా అనే విషయాలపై స్పష్టత లేనప్పుడు ఇంటి నిర్మాణాలపై ఎలా ముందుకు వెళతామని అంటున్నారు. 45 కాంటూర్ పరిధికి చెందిన నిర్వాసిత గ్రామాల పరిహారం విషయమై ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.



కుక్కునూరు బీ బ్లాక్‌లో బరకాలతో నివాసం



సంజయ్‌నగర్ కాలనీలో రేకులతో ఆవాసం

రేకుల షెడ్డు వేసుకుని..



2022 గోదావరి వరదకు మా గుడిసె దెబ్బతింది. దీంతో ఆ ఇంటిని సరిచేసుకుని దాని పక్కనే తాత్కాలికంగా రేకుల షెడ్డు వేసుకుని బరకాలు కట్టుకుని కుటుంబంతో నివసిస్తున్నా. ఇకనైనా ప్రభుత్వం మాకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇవ్వాలి.

– వేల్పుల రాజయ్య, సీఎం కాలనీ, కుక్కునూరు

పరిహారం ఇవ్వాలి



మండలంలో 45 కాంటూర్‌లో ఉన్న గ్రామాలకు పరిహారం ఎప్పుడిస్తారనే విషయమై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలి. పరిహారం ఇస్తారనే ఉద్దేశంతో నిర్వాసితులు పాత ఇళ్లలోనే ఉంటున్నారు. నిర్వాసితులకు త్వరితగతిన పరిహారం అందించాలి.

– వీరమల్ల ప్రవీణ్, వింజరం

క్లుప్తంగా

మద్దిలో అభిషేక సేవ



జంగారెడ్డిగూడెం మద్దిక్షేత్రంలో ఆంజనేయ స్వామికి అభిషేక సేవ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : గురవాయిగూడెంలో శ్రీ మద్ది ఆంజనేయస్వామికి శనివారం అభిషేక సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చకస్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.2,13,592 సమకూరినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు. 17వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు హనుమద్ హోమం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

పాపికొండల్లో వైల్డ్ డాగ్స్

- పెద్ద పులులను సైతం ఎదిరించే ధైర్యం ఈ కుక్కల సొంతం
- ఆహారం కోసం నిరంతరం సంచారం



అడవిలో సంచరించే వైల్డ్ డాగ్స్

బుట్టాయగూడెం: అరుదైన జంతుజాలానికి నిలయమైన పాపికొండల అభయారణ్యంలో క్రూర జంతువులైన అడవి కుక్కలు (వైల్డ్ డాగ్స్) గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇవి అటవీ ప్రాంతంలోని అనేక జంతువులను వేటాడుతుంటాయి. పులిని సైతం అడవి కుక్కలు భయపెట్టగలవని చెబుతుంటారు. అడవి కుక్కలు సంచరించే ప్రదేశాల్లో పులులు కూడా సంచరించవని.. వాటి ఉనికిని కనిపెట్టి తప్పించుకుని తిరుగుతాయని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. పరిమాణంలో ఊరకుక్కల కంటే కొంచెం పెద్దవిగా ఉండే వైల్డ్‌డాగ్స్ వాటి కంటే బరువు, శక్తి కలిగిన పెద్ద పులులను సైతం సమూహ శక్తితో తరిమికొట్టగలవు. అడవిలో సంచరించే అడవి పందిని ఈ వైల్డ్ డాగ్స్ చిటికెలో వేటాడి ఆహారంగా మార్చుకుంటాయి. వాటి బరువుతో పోల్చుకుంటే ఎన్నో రెట్లు పెద్దవైన కణితి(సాంబార్ డీర్), మనిమేగం లాంటి పెద్ద జింక జాతి జంతువులను కూడా ఈ అడవి కుక్కల సమూహం వెంటాడి వేటాడతాయి. ఈ వైల్డ్‌డాగ్ గుంపులు ఒకే ప్రదేశంలో స్థిరంగా ఉండకుండా నిరంతరం వేర్వేరు ప్రాంతాలకు తిరుగుతూనే ఉంటాయి. ఇవి ఊర కుక్కల కంటే కాస్త పెద్దవిగా ఉంటాయి. వీటి తోకకు వెంట్రుకలు కుచ్చుగా ఉంటాయి. ఇవి యూరప్ దేశాల్లో నల్ల మచ్చలతో కనిపిస్తాయి.

అభయారణ్యాల్లో అధికంగా సంచారం

అభయారణ్యాలుగా ఉన్న పాపికొండలు, నాగార్జున సాగర్, శ్రీశైలం అభయారణ్యం, గుండ్ల బ్రహ్మేశ్వరం అభయారణ్యంలో అడవి కుక్కల సంచారం ఎక్కువగా ఉందని వైల్డ్‌లైఫ్ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో కూడా అడవి కుక్కల సంచారం అధికంగా ఉన్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. పాపికొండల అభయారణ్యంలో సుమారు 200 కుక్కలకు పైగా గుంపులుగా సంచరిస్తున్నట్లు గుర్తించామని ప్రస్తుతం వాటి జాడ అల్లూరి సీతారామరాజు అటవీ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో గ్రామాలు ఖాళీ అవుతున్న నేపథ్యంలో ఇవి స్వేచ్ఛగా సంచరించడానికి మరింత అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

సమతుల్యతకు ప్రధాన భూమిక

వైల్డ్ డాగ్స్ జీవావరణ సమతుల్యతలో ప్రధాన భూమిక పోషిస్తుంటాయి. మాంసాహార జంతువులైన చిరుత పులి, పెద్దపులి, అడవి కుక్కల సంఖ్య తగ్గిపోతే వాటి ఆహార జంతువులైన వివిధ జంతువులు, జింకల సంఖ్య అమాంతంగా పెరిగి అడవిలోని వృక్షాలు తగ్గిపోతాయి. రైతులకు ఇబ్బంది కలిగించే అడవి పందులు, జింకల సంఖ్య పెరుగుదల ప్రమాదకరంగా మారకుండా నియంత్రణలో ఈ అడవి కుక్కలు ప్రధాన భూమిక పోషిస్తాయని అధికారులు అంటున్నారు.

నీరు లాగక.. వేదన తీరక



చినరామచంద్రపురంలో చెరువులా మారిన పంట పొలాలు

గణపవరం: సార్వా పైరు ఇంకా ముంపులోనే ఉంది. బుధవారం రాత్రి కనీవినీ ఎరుగని రీతిలో కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో సార్వా పైరు నీట మునిగింది. సుమారు 650 హెక్టార్ల విస్తీర్ణంలో పైరు నీట మునిగినట్లు ప్రాథమికంగా అంచనావేశారు. ఈ నష్టం దాదాపు రెట్టింపు ఉంటుందని రైతులు చెబుతున్నారు. కొందేపాడు, పిప్పర, కేశవరం, కోమర్రు, వెంకట్రాజపురం, సరిపల్లె, కొత్తపల్లి, గణపవరం తదితర గ్రామాలలో వరినాట్లు నీటమునిగాయి. చినరామచంద్రపురంలోని పల్లపుభూములలో నాట్లు మొత్తం నీటమునిగాయి. పిప్పర పరిసర గ్రామాలలో వరిపైరు చివరలు కనిపిస్తున్నాయి. పొలాలలో నీరు బయటకు పంపడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. చుక్కనీరు బయటకుపోయే మార్గం కనిపించడం లేదు. ఇంజిన్లు వేసి నీటిని బయటకు తోడుకుంటున్నారు. కాలువగట్లు పల్లంగా, బలహీనంగా ఉన్న చోట్ల గట్లను రైతులే మట్టి, కంకరతో పటిష్టం చేసుకుంటున్నారు. శుక్ర, శనివారాలలో వర్షం కురియక పోవడంతో పరిస్థితి కొంత కలిసివచ్చింది.

నిర్వాసితుల సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడతా

బుట్టాయగూడెం: సీపీఎం ఫ్లోర్ లీడర్, కేరళ ఎంపీ జాన్ బ్రిట్టాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తులసీదాస్, సీపీఎం నాయకుల బృందం శనివారం ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించింది. బృంద సభ్యులు టేకూరు నిర్వాసిత కాలనీని సందర్శించారు. నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెడ్డిగణపవరం వద్ద సభలో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నట్లు కనిపించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల లక్ష ఆరువేల గిరిజన కుటుంబాలు ముంపునకు గురువుతున్నాయన్నారు. నిర్వాసితులకు పునరావాసం, వసతులపై ఉత్సాహం చూపించడం లేదన్నారు. 80 శాతం గిరిజనులు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల తమ ఉనికిని కోల్పోతున్నారని వారికి సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు పూర్తి స్థాయిలో పునరావాసం, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలను పార్లమెంట్‌లో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. బలరామ్, తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని రెడ్డిగణపవరంలో జరిగిన సభలో మాట్లాడుతున్న కేరళ ఎంపీ జాన్ బ్రిట్టాస్

శ్రీవారి భక్తులకు 'సెల్' కష్టాలు

- సెల్‌ఫోన్‌లు భద్రపరిచేందుకు కౌంటర్ వద్ద క్యూ
- గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి
- కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో దేవస్థానమే స్వయంగా చేపట్టిన వైనం
- అనుభవం లేక.. సిబ్బంది చాలక సమస్యలు



సెల్‌ఫోన్‌లు డిపాజిట్ చేసేందుకు కౌంటర్ వద్ద గుమికూడిన భక్తులు

ద్వారకాతిరుమల: దైవ దర్శనార్థం ఏదైనా ఆలయానికి వెళ్లినప్పుడు దేవుడి దర్శనం కోసం క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండటం సహజం . కానీ ద్వారకాతిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులు తమ సెల్‌ఫోన్‌లను డిపాజిట్ కౌంటర్‌లో భద్రపరచుకునేందుకు గంటల తరబడి క్యూ లైన్‌లో వేచి ఉండాల్సి వస్తోంది. ఇదంతా ఒక ఎత్తయితే కౌంటర్‌లో ఇచ్చిన ఫోన్‌లు భద్రంగా ఉన్నాయో లేదోనన్న ఆందోళన భక్తులను వెంటాడుతోంది. వివరాల్లోకి వెళితే.. శ్రీవారి దర్శనం నిమిత్తం ఆలయంలోకి వెళ్లే భక్తులు ముందుగా తమ సెల్‌ఫోన్లను వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఉన్న సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్‌లో అప్పగించాలి. భద్రపరచినందుకు ఒక్కో ఫోన్‌కు రూ.5 వసూలు చేస్తారు. శుక్రవారం వరకు ఒక కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో నడిచిన ఈ కౌంటర్ నిర్వహణ బాధ్యతను, శనివారం నుంచి దేవస్థానమే స్వయంగా చేపట్టింది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ఆరుగురు సిబ్బంది భక్తుల సెల్‌ఫోన్‌లను భద్రపరిచారు. ఇదిలా ఉంటే ఒక భక్తుడు తన రూ.1.50 లక్షలు విలువ చేసే సెల్ ఫోన్ పగిలిపోయిందని, దానికి సమాధానం చెప్పాలని గొడవ చేశాడు. సీసీ కెమెరాలను పరిశీలించిన అధికారులు సెల్‌ఫోన్ తమ వద్ద డ్యామేజ్ కాలేదని చెప్పారు. దాంతో ఆ భక్తుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సెల్‌ఫోన్ కౌంటర్ నిర్వహణకు రెండు నెలల క్రితం దేవస్థానం బహిరంగ వేలం నిర్వహించగా, ఒక కాంట్రాక్టర్ ఏడాదికి రూ.కోటి 20 లక్షలు దేవస్థానానికి చెల్లించేలా పాటను దక్కించుకున్నాడు. కౌంటర్ ప్రారంభించకుండానే చేతులెత్తేశాడు. దాంతో ఆ కాంట్రాక్టర్ పాట సమయంలో డిపాజిట్ చేసిన రూ.5 లక్షలను అధికారులు దేవస్థానం అకౌంట్‌కు జమ చేశారు. ఇదిలా ఉంటే మళ్లీ పాట నిర్వహించే వరకు కౌంటర్ నిర్వహణ బాధ్యతను చేబోలు రాజేష్ అనే కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అతడు నష్టం వస్తోందని వదిలేశాడు. దాంతో భక్తుల సౌకర్యార్థం, భద్రతా దృష్ట్యా ఆలయంలోకి సెల్‌ఫోన్‌లు అనుమతించ కూడదని దేవస్థానమే స్వయంగా ఈ సెల్‌ఫోన్లు భద్రపరిచే పనిని చేపట్టింది.



సెల్‌ఫోన్‌లు డిపాజిట్ చేసేందుకు ఆలయ ఆవరణలో క్యూ కట్టిన భక్తులు

అనుభవం లేక.. సిబ్బంది చాలక

సెల్ ఫోన్ కౌంటర్ నిర్వహణలో దేవస్థానం సిబ్బందికి అనుభవం లేదు. శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో సిబ్బంది కూడా చాల్లేదని తెలుస్తోంది. మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక కంప్యూటర్ మీదే టికెట్‌లు కొట్టారు. ఆ తరువాత రెండో కంప్యూటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సమస్యల వల్ల భక్తులు గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. స్వామివారి దర్శనానికి కంటే సెల్‌ఫోన్ భద్రపరచుకోవడానికే ఎక్కువ సమయం పట్టిందని భక్తులు వాపోయారు. కార్లలో దర్శనానికి వచ్చిన భక్తులు తమ ఫోన్‌లను వారి వాహనాల్లోనే వదిలేశారు. బైక్‌లపై వచ్చిన వారు క్యూలైన్లలో నిలబడక తప్పలేదు.

వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం కార్యదర్శిగా ధర్మరాజు



చింతలపూడి: వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన కుక్కల ధర్మరాజును నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శిగా సూరిబాబు



పెంటపాడు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ విభాగ కార్యదర్శిగా పెంటపాడుకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు



చిలుకూరి జ్ఞానారెడ్డి



మల్లీడి మోహన కృష్ణ(బాబి)

చింతలపూడి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శులుగా చింతలపూడి మండలానికి చెందిన చిలుకూరి జ్ఞానారెడ్డి, జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన మల్లీడి మోహనకృష్ణ(బాబి)లను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ సేవలను గుర్తించి రాష్ట్ర కార్యదర్శులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

దగ్ధమైన నానో కారు



తణుకులో కాలిపోతున్న నానో కారు

తణుకు అర్బన్ : పార్కింగ్ చేసిన కారులో మంటలు చెలరేగిన ఘటన శనివారం తణుకు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఇరగవరం మండలం కంతేరు గ్రామానికి చెందిన రుషి తన కుటుంబ సభ్యులతో తణుకు బ్యాంకు కాలనీలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలంలో నానో కారు పార్కింగ్ చేసి ఆసుపత్రిలోకి వెళ్లారు. కొద్దిసేపటికే కారు నుంచి పొగలు వ్యాపించి నిమిషాల వ్యవధిలోనే మంటలు అంటుకున్నాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లుగా భావిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నాగిరెడ్డిగూడెం పాఠశాల ఉపాధ్యాయులు

చింతలపూడి: రాష్ట్ర స్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీలకు నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎస్.జాస్మిత ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.హేమలత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను సత్కరించి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ ఈనెల 10న ఏలూరు లోని ఓల్డేజ్ హోంలో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్టిస్టిక్ పోటీల్లో ఎస్.జాస్మిత ఉత్తమ ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించిందని చెప్పారు. మరో విద్యార్థిని అమలారాణి ట్రెడిషనల్ జూనియర్ యోగా పోటీలలో మూడో స్థానంలో నిలిచి మెడల్ సాధించిందన్నారు.

పాములపర్రులో దళితులకు న్యాయం చేయాలి



పాములపర్రు శ్మశాన వాటికను పరిశీలిస్తున్న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మాపు చిత్రసేను తదితరులు

ఉండి: పాములపర్రు దళితులకు న్యాయం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మాపు చిత్రసేను అన్నారు. పాములపర్రులో దళితుల శ్మశాన ప్రాంతాన్ని బీఎస్పీ నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిత్రసేను మాట్లాడుతూ పూర్వీకుల అస్తికలున్న శ్మశాన వాటికను కాపాడుకునేందుకు ప్రాణాలైనా అర్పిద్దామని అన్నారు. శ్మశానంలో రోడ్డు వేయడానికి తెగించడమే కాకుండా వారిపైనే దాడికి తెగబడతారా అని ప్రశ్నించారు. శ్మశానంపై దళితులకు హక్కులున్నా అధికార పక్షం ఇష్టానుసారం వ్యవహరిస్తుందన్నారు. అధికారులంతా ఏకపక్షంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజంగా మంచి ప్రభుత్వం అయితే దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల ఏలియా రాజు, ఇన్‌చార్జి ఆలూరి చిన్నారావు, తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి చల్లాబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, సెల్‌ఫోన్లతో సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్ తదితరులు

భీమడోలు: గంజాయిని తరలిస్తున్న నలుగురు యువకులను భీమడోలు పోలీసులు అరెస్ట్ చేశారు. భీమడోలు సీఐ యూజే విల్సన్ శనివారం కేసు వివరాలను వెల్లడిస్తూ.. శుక్రవారం సాయంత్రం ద్వారకాతిరుమల నుంచి భీమడోలు వైపుగా వస్తున్న వాహనాలను భీమడోలు పోలీసులు తనిఖీ చేస్తున్నారన్నారు. రెండు బైక్‌లపై ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన మోటూకూరి శామ్యూల్, కైకరానికి చెందిన దొడ్డి లక్ష్మీనారాయణలు, తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడుకు చెందిన దిరిసి పాము నిషాంత్, ముసళ్లకుంటకు చెందిన చీర రవి బాబు అనుమానాస్పద స్థితిలో పారిపోతుండగా పోలీసులు పట్టుకుని తనిఖీలు చేశారు. వారి నుంచి రూ. 40 వేల విలువ గల 2.13 కిలోల గంజాయిని పట్టుకున్నారు. రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసారు. వారిని భీమడోలు సివిల్ కోర్టులో హాజరు పర్చగా నిందితులకు రిమాండ్ విధించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితులంతా 19 నుంచి 23 ఏళ్ల లోపు వారేనని సీఐ తెలిపారు.

జేసీబీ ప్రమాదంలో కార్మికుడి మృతి

కొయ్యలగూడెం: జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యం కార్మికుడిని బలి తీసుకుంది. ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం లచ్చూ సింగ్ (42) జేసీబీ కన్వేయర్ గేర్ బాక్స్‌లో చిక్కుకుని శనివారం ప్రాణాలు కోల్పోయాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన లచ్చూ సింగ్ మరో ఇద్దరితో కలిసి గత ఏప్రిల్‌లో వలస కార్మికులుగా వచ్చి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు చేస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పనులు నిర్వహిస్తుండగా జేసీబీ రిపేరుకు గురైంది. దీంతో వినోద్ అనే మరొక వ్యక్తితో కలిసి గేర్ బాక్స్ సరి చేస్తున్న సమయంలో జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యంగా ముందుకు నడిపాడు. దీనిని గమనించిన మరొక వ్యక్తి వినోద్ దూకి ప్రాణాలను రక్షించుకోగా లచ్చూ సింగ్ జేసీబీకి, గేర్ బాక్స్ కి మధ్య చిక్కుకుపోయి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని గోపాలపురం ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు



అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పదనే రీతిలో కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సెల్ టీమ్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం పోలీస్ సబ్ డివిజన్‌కు చెందిన కోర్టు మానిటరింగ్ సెల్ టీమ్ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. నిందితులకు శిక్షలు పడేలా... బాధితులకు సత్వర న్యాయం జరిగేలా మరింత శ్రద్ధగా, సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. నేరస్తులు తప్పించుకోకూడదని, బాధితులు పోలీస్, న్యాయస్థానాలపై నమ్మకం పెరిగేలా కృషి చేయాలని చెప్పారు. ప్రతి రోజూ కోర్టులో జరిగిన ప్రక్రియను డాక్యుమెంట్ రూపంలో స్టేషన్ అధికారికి నివేదించాలని తెలిపారు. ఏలూరు జిల్లాలో కోర్టు మానిటరింగ్ సెల్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సమీక్షలో టీడీసీ డీఎస్పీ ప్రసాదరావు, కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ యం.సుబ్బారావు, డీసీఆర్‌బీ సీఐ హబీబ్ భాషా, సిబ్బంది ఉన్నారు.

20న ఎలక్ట్రికల్ వర్కర్ల రాష్ట్ర సమావేశం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 20న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లకు కూటమి ప్రభుత్వం న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పలు సమస్యలపై తీర్మానాలు చేసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పోరాటాల స్ఫూర్తి గౌతు లచ్చన్న


సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధులు, బీసీల అభ్యున్నతికి కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శనివారం స్థానిక హౌసింగ్‌బోర్డులో బీసీ సంఘం జాతీయ నాయకులు తాతా శ్రీనివాసరావు ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ గౌతు లచ్చన్న జీవితం ఆయన చేసిన పోరాటాలు, తదితర విశేషాలను వెల్లడించారు. బీసీ సంఘం నాయకులు వర్ధనపల్లి కాశీ, కోట రాంబాబు, అత్తిలి శ్రీను, అత్తిలి బాబి, వాకా నాని, చిటకన శ్రీనివాస్, సందక రమణ, దుర్గారావు, బత్తిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువులో 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం శ్రీరామపురం, పెదగరువు గ్రామాలకు వెళ్లే 22 కేవీ ఫీడర్లకు సంబంధించి ఆర్‌డీఎస్ఎస్ పనులు, చెట్లు, కొమ్మలు తొలగించుట వార్షిక మరమ్మతులు నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెదగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవిత బీమా సంస్థ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిధుల కేటాయించారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి ఉపసభాపతి కె.రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎల్ఐసీ రాజమండ్రి యూనిట్ సీనియర్ డివిజనల్‌మేనేజర్ సత్యనారాయణ సాహూ హాజరవుతారని స్పష్టం చేశారు.

వెంకన్నకు ఊంజల్ సేవ

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రావణ శనివారం, శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు అంగరంగ వైభవంగా అష్టోత్తర శతనామార్చన, సహస్రదీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ ఘనంగా చేశారు. స్వామి వారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు

వీరవాసరం: స్థానిక మెయిన్ స్కూల్‌లో మద్దాల రామకృష్ణమ్మ ఆస్తుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మద్దాల తాతారావు ఆర్థిక సహాయంతో శనివారం సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అంతా చక్కగా చదువు కుంటే మంచి భవిష్యత్ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేంద్ర దివాకర్, గ్రంధి పెద్దకాపు, మద్దాల రాజేష్ నాయుడు, మద్దాల శివాజీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు

వీరవాసరం: మండలంలోని బాలేపల్లి గ్రామంలో యర్రంశెట్టి వెంకటేశ్వరరావు (తాతాజీ) మాస్టారు ఇంట్లో శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా ఉండే అరుదైన బ్రహ్మకమలాలు శనివారం వికసించాయి. బ్రహ్మకమలాలు హిమాలయపర్వతాలు, ఉత్తరప్రదేశ్, ఉత్తర బర్మా, టిబెట్, నేపాల్, దక్షిణ చైనా ప్రాంతాల్లో దర్శనమిస్తూ ఉంటాయి. ఈ బ్రహ్మకమలములను కింగ్ ఆఫ్ హిమాలయన్ ఫ్లవర్ అని పిలుస్తారు. ఇటువంటి అరుదైన పుష్పం పవిత్రమైన శ్రీ కృష్ణాష్టమి రోజు మా ఇంట్లో వికసించడం అదృష్టంగా భావిస్తున్నామని యర్రంశెట్టి తాతాజీ మాస్టారు అన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: స్థానిక కోర్టు సముదాయంలో సెప్టెంబర్ 13న జాతీయలోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి చెప్పారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. రాజీ చేసుకోదగిన కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవడానికి ఇదో మంచి అవకాశమని చెప్పారు. అన్ని రకాలు కేసులు రాజీ చేసుకోవచ్చని వివరించారు.

గందరగోళంగా పీ 4

- ఉద్యోగుల్లో ఆందోళన
- ముందుకురాని మార్గదర్శకులు
- బంగారు కుటుంబాల ఎంపిక నిబంధనలపై వ్యతిరేకత
- కూటమి నాయకుల ఒత్తిడితో ఇబ్బందులు
- సూపర్ సిక్స్ ఇవ్వలేకే పీ 4 అంటున్నారని విమర్శిస్తున్న ప్రజానీకం


తణుకు పట్టణ వ్యూ

తణుకు అర్బన్: అట్టడుగు పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చిన పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్ (పీ 4) అంశం అధికారులు, ఉద్యోగులకు తలనొప్పిగా మారింది. ముఖ్యంగా పీ 4 అంశంపై క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. పీ 4లో భాగస్వామి అయి పేద వర్గాలను ఆదుకునే క్రమంలో సంపన్నులు ముందుకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఇటు కూటమి ప్రభుత్వం, అటు ఉన్నతాధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ఈ విధానంలో సైతం ఎన్నో లోపాలు ఉన్నాయని ఇది సత్ఫలితాలు అందించే పరిస్థితి కనిపించడంలేదని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. పీ 4 లబ్ధిదారులను బంగారు కుటుంబాలుగాను, సంపన్నులను మార్గదర్శకులుగాను నిర్దేశించారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 66 సచివాలయాల్లో బంగారు కుటుంబాలను 5,951గాను, మార్గదర్శకులను 693గా నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ఉసూరుమనిపిస్తున్న నిబంధనలు

అట్టడుగున ఉన్న పేదరికాన్ని గుర్తించి వారిలో బంగారు కుటుంబాలుగా ఎంపిక చేసే క్రమంలో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలు పథకాన్ని నిర్వీర్యం చేసేవిగా ఉన్నాయని ప్రజానీకం చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా బంగారు కుటుంబాన్ని ఎంపిక చేసే క్రమంలో ప్రభుత్వం పెట్టిన నిబంధనల్లో భాగంగా గ్యాస్ కనెక్షన్ లేనివారు, గృహ విద్యుత్ కనెక్షన్ లేనివారు, బ్యాంక్ ఖాతా లేనివారు, ఆదాయం లేని కుటుంబం, రక్షిత నీరు అందుబాటులో లేనివారిని అధికారులు గుర్తించాల్సి ఉంది. దీంతో సూపర్‌సిక్స్ పేరుతో ఇవ్వాల్సిన సంక్షేమాన్ని తప్పించుకునేందుకే ప్రభుత్వం పీ 4ను తెరపైకి తెచ్చిందని, సూటిగా చెప్పాలంటే ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకునే క్రమంలోనే ఈ పీ 4 అమల్లోకి తెస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి నేతల్లోనే వ్యతిరేకత..

బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు మార్గదర్శకులు పేరుతో సంపన్నులు ముందుకురాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటుండగా కూటమి నేతలు సైతం వ్యతిరేకించే పరిస్థితి ఎదురైంది. సంపన్నులు ముందుకు రాకపోవడంతో ఉపాధ్యాయులను మార్గదర్శకులుగా మార్చాలనే అంశం కూడా తెరపైకి వచ్చింది. దీంతో ఉపాధ్యాయ వర్గాలు సైతం తీవ్రంగా వ్యతిరేకించే పరిస్థితి తలెత్తింది. పైగా మార్గదర్శకులు చేసే సాయం కూడా ముందుగా ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి బదిలీ చేయాలని, ఆనక ఆ మొత్తం ప్రభుత్వం నుంచి బంగారు కుటుంబాలకు అందుతాయనే సూచనలు పీ 4కు గండికొడుతున్నాయని ప్రజానీకం చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా బంగారు కుటుంబాలు, మార్గదర్శకులను ఎంపిక చేయడంలో క్షేత్రస్థాయి ఉద్యోగుల తలలు బొప్పికడుతున్న పరిస్థితుల్లో ఉద్యోగులకు క్షేత్రస్థాయిలో మరొక చిక్కొచ్చిపడినట్లు తెలుస్తోంది. వార్డుల్లో నాయకులు తాము చెప్పిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయాలనే ఒత్తిడి కూడా పెరుగుతుందని దీంతో క్షేత్రస్థాయి ఉద్యోగులకు ఏమిచేయాలో తోచక ఇబ్బందులు పడుతున్నట్లుగా సమాచారం. బంగారు కుటుంబాల ఎంపికలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలా లేక స్థానిక కూటమి నేతల ఒత్తిళ్లకు లొంగాలో అర్థం కాని దుస్థితిలో ఉద్యోగులు సతమతమవుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్థిక సంపన్నులుగా ఉన్న కొందరు కూటమి నేతలు సైతం మార్గదర్శకులుగా ముందుకు రాకపోవడాన్ని ఇటు ప్రజానీకం, అటు ఉద్యోగులు కూడా వ్యతిరేకిస్తున్నారు.

పీ 4 ఫ్లాప్ అవుతుంది



పీ 4 పథకం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సూపర్ సిక్స్ అమలుచేయలేక కూటమి ప్రభుత్వం పీ 4 అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారని కానీ బంగారు కుటుంబాల ఎంపికలో ఉన్న కఠినతరమైన నిబంధనలు పథకాన్ని నిర్వీర్యం చేసేదిగా ఉండగా, మార్గదర్శకులుగా నిలబడేందుకు సంపన్నులు కూడా ముందుకు రాని దుస్థితి నెలకొంది. ఇప్పటికే కూటమి తాలూకా మీడియానే ఈ పథకంపై వ్యతిరేక కథనం ఇవ్వాల్సి వచ్చింది.

– ఉండవల్లి జానకి, వైఎస్సార్ సీపీ తణుకు మండల మహిళాధ్యక్షురాలు

నేడు శృంగవృక్షంలో ఉచిత వైద్య శిబిరం

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం గ్రామ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యం లో ఆర్య వైశ్య కల్యాణ మండపం లో ఆదివారం ఉచిత వేరికోస్ వైన్స్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉబ్బి మెలికలు తిరిగిన నరాలు, సాలె పురుగు లాంటి నరాలు, పాదం వేలిలో గ్యాంగ్రిన్ రావడం, కాళ్లల్లో, పాదాల్లో నలుపు రావడం, ఉబ్బిన నరాలు,సుగర్ వ్యాధిగ్రస్తులకు కాళ్లపై పుండ్లు, వేళ్ళు నల్లబడటం, బోదకాలు చికిత్స, ఆకస్మికంగా తగ్గిన రక్త ప్రసరణను పునరుద్ధరించుట, కిడ్నీ రోగుల డయాలసిస్ ఏవీ ఫిస్టులా, కెరోటిడ్ డిసీజ్, వాస్క్యులర్ మాల్ ఫార్మేషన్స్‌కు చికిత్స, ప్రమాదాల్లో గాయపడిన రక్తనాళాలకు చికిత్సలకు ఉచితంగా వైద్యం చేస్తారని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రూ.5 వేలు విలువైన కలర్ డాప్లర్ అల్ట్రా సౌండ్ పరీక్షలు, కన్సల్టేషన్ ఉచితంగా చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాజ్‌పేయి జీవితం ఆదర్శనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అటల్ బిహారి వాజ్‌పేయి జీవితం ఆదర్శనీయమని పలువురు బీజేపీ నాయకులు కొనియాడారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వాజ్‌పేయి 7వ వర్ధంతిని శనివారం సుబ్బారావుపేట కార్యాలయంలో నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు దువ్వా శ్రీను, నరిసే సోమేశ్వరరావు, గట్టిం సింధు తదితరులు పాల్గొన్నారు.

కారుమూరి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు


తణుకులో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి కారుమూరి


బల్లిపాడులో కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు


అలంపురంలో కృష్ణుడి ఆలయంలో ఊయల సేవ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: కృష్ణాష్టమి సందర్భంగా తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో కారుమూరి వెంకట నాగేశ్వరరావు, లక్ష్మి కిరణ్ దంపతులు పీటలపై కూర్చుని పూజాధికాలు జరిపారు. కృష్ణ భగవానుడి ఆశీస్సులతో ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో తులతూగాలని, రైతాంగం సుభిక్షంగా వర్ధిల్లాలని కారుమూరి ఆకాంక్షించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టి కొట్టిన చిన్నారులకు కారుమూరి దంపతులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులు, పార్టీ శ్రేణులకు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిసెట్టి శేషగిరి, పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, జల్లూరి జగదీష్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మెహర్ అన్సారి, పట్టణ మహిళా అధ్యక్షురాలు నూకల కనకదుర్గ, షేక్ పహిమ, మమత యాదవ్, బిరుదుకోట చింతన్న, నాసరి పార్థసారథి, చోడే గోపీకృష్ణ, పుల్లెపు సూర్యచంద్రరావు, గంజి సతీష్, పైడి సాయి సూర్య, కొమ్మోజు రామకృష్ణ, గెద్దాడ శ్రీకాంత్, షేక్ జిలాని, చింతాడ సంజీవరావు, యారబాటి రామకృష్ణ, రేలంగి రాంబాబు, గారపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

అత్తిలి: ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణ తత్వాన్ని తెలుసుకుని జీవించాలని పాఠశాల డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్ అన్నారు. శనివారం అత్తిలి మండలం బల్లిపాడు శ్రీ మదన గోపాల్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలు అలరించారు. సాంప్రదాయ వస్త్రధారణలో ముచ్చట గొలిపారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టి ముంత కొట్టుటకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాడిగ నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఆకుల శ్రీనివాసరావు, శివకృష్ణ, అనిత తదితరులు పాల్గొన్నారు. అత్తిలి పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో అజయ్‌నగర్‌లో కృష్ణ జన్మాష్టమి 29వ వార్షికోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆవాల వెంకట రామకృష్ణ, నాగ వెంకటలక్ష్మి దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆల్తి సత్యనారాయణ, ఆల్తి అజయ్, ఆవాల అప్పారావు, నక్కాని పద్మనాభం పాల్గొన్నారు.

గ్రామాల్లో కృష్ణాష్టమి సందడి

ఇరగవరం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరానికి అందించాలంటే హిందూ పండుగలన్నింటిలో బాలలు, యువతను భాగస్వాములు చేయడం ద్వారానే సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. మండలంలోని 21 గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఇరగవరం, తూర్పు విప్పర్రు, కాకిలేరు, కె ఇల్లిందలపర్రు, కంతేరు, రేలంగి, కొత్తపాడు, కత్తవపాడు, గోటేరు, అర్జునుడుపాలెం, కె కుముదవల్లి గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, భక్తులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో...

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కె. పెంటపాడు గోపాలస్వామి ఆలయంలో అర్చకులు త్రిలోచన దాస్ ఆధ్వర్యంలో ఒరిస్సా సాంప్రదాయంలో కృష్ణుని జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈవో చంద్రశేఖర్ తదతరులు ఆధ్వర్యం వహించగా వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అలంపురం కృష్ణుని ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కృష్ణాష్టమి వేడుకలు పురస్కరించుకొని మహిళలు గీతాపారాయణం, లలిత సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం స్వామివారికి ఊయల సేవ నిర్వహించారు. విప్పర్రు వేంకటేశ్వరుని ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు బోణం వీరయ్య ఆధ్వర్యంలో కృష్ణాష్టమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీకృష్ణునికి పంచామృతాభిషేకాలు


వెంకట్రామన్నగూడెం గ్రామంలోని రాధాకృష్ణ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోదుగగుంట, కుంచన పల్లి, పట్టింపాలెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాథపురం, కృష్ణాయపాలెం, కృష్ణాపురం, నీలాద్రిపురం గ్రామాల్లో శ్రీకృష్ణునికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించేందుకు భక్తులు తరలివచ్చారు. అలాగే, పలువురు మహిళలు కృష్ణాష్టకం పారాయణచేశారు. రాత్రి ఉట్టికొట్టే కార్యక్రమం కోలాహలంగా నిర్వహించా రు. వెంకట్రామన్న గూడెంలోని రాధాకృష్ణ ఆలయంలో సర్పంచ్ పోలిమెను నాగ అంజూష- శ్రీనివాస్, ముప్ప శ్రీను దంపతులు స్వామివారి కళ్యాణాన్ని జరిపించారు. అనంతరం గ్రామంలో స్వామివారి ఊరేగించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు అన్నారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, సీఎస్‌డీ, సీఎస్ఐటీ డిపార్ట్‌మెంట్‌ల సంయుక్తంగా ఈ నెల 14, 15 తేదీల్లో టెక్నాలజీ సెంటర్లో 'వేదిక్ విజన్ 2కె25' పేరిట నిర్వహించిన హ్యాక్ థాన్ పోటీల్లో విజేతలకు శనివారం ఉదయం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఉభయగోదావరి జిల్లాలలోని 8 ఇంజనీరింగ్ కళాశాల నుండి 53 బందాలుగా 265 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. ఇందులో ప్రథమ స్థానం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు సాధించగా, ద్వితీయ స్థానంలో సీఎస్ ఐటీ విభాగం విద్యార్థులు నిలిచారు. మూడవ స్థానంలో ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు ఉన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్, డాక్టర్ పి.సత్యనారాయణ రాజు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు బహుమతుల అందజేత


విద్యార్థినులకు నగదు బహుమతులు అందిస్తున్న వెంకటరమణారావు

పాలకొల్లు సెంట్రల్: ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రకటించిన ఓ ఛాలెంజ్‌ను ఎనిమిది మంది విద్యార్థులు సాధించి చూపించారు. తన ఛాలెంజ్‌ను స్వీకరించి పట్టుదలతో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు అన్న మాట ప్రకారం నిలబెట్టుకున్నారు. మండలంలోని పూలపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో స్వాతంత్ర దినోత్సవాల సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు వారది వెంకటరమణారావు రూ. 50 వేలు నగదు బహుమతి అందజేశారు. ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 550 మార్కులు దాటిన విద్యార్థులకు రూ.10,116లు 500 మార్కులు దాటితే రూ.1116లు, ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1116లు, నేషనల్ స్థాయిలో విజేతలకు రూ.10,116లు నగదు బహుమతి ఇస్తానని వెంకటరమణారావు ప్రకటించారు. పాఠశాల విద్యార్థులు పి.వర్షిత నాగలక్ష్మి 568, జి.తేజస్వి 562, డి.రూపా తేజస్వి 552 మార్కులు సాధించగా ఒక్కొక్కరికి రూ. 10,116లు అందజేశారు. ఏవై లాస్యప్రియ 549 మార్కులు సాధించడంతో రూ.5116లు అందిచారు. ఎస్.కీర్తన 541, ఎస్ సత్యమణి 526, ఎం రమ్యశ్రీ 510 విద్యార్థినులకు రూ.1116లు అందజేశారు. యోగాంధ్ర స్టేట్ మీట్‌లో ప్రథమస్థానం సాధించిన బి.విజయ్ కుమార్‌కు రూ.1116లు చెక్కులను అందజేశారు. వీరికి రూ. 40 వేలు ఖర్చు కాగా మిగిలిన రూ.10 వేలతో స్పోర్ట్స్ కిట్లు అందించారు. తన తండ్రి వారది సూర్యనారాయణ జ్ఞాపకార్థం నగదు పురస్కారం అందించినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీటీ వెంకటకుమార్ వ్యాయామ ఉపాధ్యాయుడిని అభినందించారు.

పట్టణ సుందరీకరణలో మునిసిపాలిటీ నిర్లక్ష్యం


రైల్వేస్టేషన్ రోడ్డులో సెంట్రల్ డివైడర్ల మధ్య కనిపించని మొక్కలు

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారైంది. ఎక్కడబడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడి, అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడీ గతంలో ప్లాట్‌ఫామ్ నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. కొండాలమ్మ గుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో పాటు నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గోదావరిబండ్‌కు వెళ్ళే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రైల్వేస్టేషన్‌రోడ్డులో సెంట్రల్ డివైడర్ల వద్ద పాతిన మొక్కలు లేకుండా పోయాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీటి పరిస్థితిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పుంత రోడ్ల చింత తీరేదెన్నడు?


వడలి సుబ్బారాయుడు పుంత


సత్యవరం పుంత రహదారి

పెనుగొండ: వ్యవసాయ మార్కెటింగ్ యార్డులకు నూతన కమిటీల నియామకంతో పుంత రోడ్లపై రైతన్నలు గంపెడాశలు పెట్టుకుంటున్నారు. ఆరుగాలాలు పాటు కష్టించి సాగు చేసుకున్న వ్యవసాయ ఉత్పత్తులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిల్లులకు చేర్చుకోవడానికి పుంత రోడ్లు ఉపయోగ పడతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో పుంత రోడ్ల నిర్మాణాలు చేశారు. అనంతరం పుంతరోడ్ల నిర్మాణాల వైపు కన్నెత్తి చూడలేదు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల నిధుల కోత విధించడంతో పుంతరోడ్ల నిర్మాణాలకు ఆటంకం ఏర్పడింది. 2014 ప్రాంతంలో పెనుగొండ మండలంలో తామరాడ, వడలి, నడిపూడి, రామన్నపాలెంల్లోనూ, పెనుమంట్ర మండలంలో రామేశ్వరం, జుత్తిగ, ఆలమూరు వంటి ప్రాంతాల్లోనూ పుంత రోడ్ల నిర్మాణాలు దాదాపుగా రూ.60 లక్షలతో పూర్తి చేశారు. అనంతరం మరోసారి నిర్మాణాలు చేయడానికి రూ.80 లక్షలతో సైతం పలు పుంత రోడ్ల నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదనలు సైతం చేశారు. అయితే నిధుల కోత విధించడంతో ప్రతిపాదనల స్థాయిలోనే అటకెక్కాయి. అప్పటి నుంచి పుంత రోడ్లపై ఆశలు పెట్టుకున్నా రైతులకు నిరాశే మిగులుతుంది.

పుంత రోడ్లు నిర్మించాలని రైతుల వినతులు

ఇటీవల పెనుగొండ, ఆచంట ఏఎంసీలకు నూతన కమిటీల నియామకాలు పూర్తికావడంతో మరోసారి పుంత రోడ్ల నిర్మాణాలపై రైతులు విజ్ఞప్తులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా పెనుగొండ మండలం, పెనుమంట్ర మండలాల్లో పుంత రోడ్ల నిర్మాణాలు చేపట్టాలంటూ రైతులు విన్నవించుకుంటున్నారు. వడలి నుంచి దొంగరావిపాలెం వెళ్లే పుంత రహదారిలో వందలాది మంది రైతులు పంట ఉత్పత్తులను రోడ్డుపైకి తెచ్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారని, పుంత రోడ్డు నిర్మాణం చేపడితే కష్టాలు తప్పుతాయంటున్నారు. అదేవిధంగా పెనుగొండ అడ్డపుంత రహదారిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పుంత రహదారిలో రైతుల వరి పొలాలుతో పాటు, కాలనీలు సైతం ఉండడంతో పుంత రహదారి నిర్మాణం చేపడితే ఉపయోగకరంగా ఉంటుందని కాలనీవాసులు, రైతులు విన్నవించుకుంటున్నారు. దీంతో పాటు సత్యవరం పుంత రహదారి నిర్మాణం చేపట్టాలంటూ రైతులు కోరుతున్నారు. రామన్నపాలెం, వడలి, ఇలపర్రు, నడిపూడి, దేవల్లోనూ పుంత రహదారులు అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.